# బీఆర్‌ఎస్ సభ.. కాంగ్రెస్‌కు దడ!

## రజతోత్సవ సభతో హస్తం బేజారు • దిక్కుతోచని స్థితిలో లీడర్, క్యాడర్

- ఇక తమ పని ఖతమేననే నిర్ణయానికి వచ్చేసిన అధికార పార్టీ నేతలు
- అధికారంలో ఉన్న పార్టీ ఏడాదిన్నరలోనే ఇంత పతనమా?
- ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి ఇంత క్రేజా
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల్లో జోరుగా చర్చ
- కాంగ్రెస్ పని అయిపోయినట్టే.. మళ్లీ లేవడం కష్టమేనని ఆందోళన
- దారిచూపడంలో కాంగ్రెస్ నాయకత్వం ఫెయిల్ అయిందనే విమర్శలు
- కేసీఆర్ ప్రసంగం కోసం సీఎం సహా మంత్రులంతా ఎదురుచూపులు
- గంటసేపు సీఎం ఇంట్లోనే అంతా కలిసి ప్రసంగం వీక్షణ
- అనంతరం మంత్రులతో ఎదురుదాడి
- కేసీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. వ్యక్తిగత దాడికే పరిమితం



హైదరాబాద్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ): ఒక్క సభ... అధికార కాంగ్రెస్‌ను ఉలిక్కిపడేలా చేసింది. 50 నిమిషాల ప్రసంగం కాంగ్రెస్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. ఆ సభ బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ అయితే.. ఆ స్పీచ్ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ది. ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సక్సెస్ కావడంతో అధికార కాంగ్రెస్ బెంబేలెత్తిపోయింది. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టిన కేసీఆర్ ప్రసంగంతో ఆత్మరక్షణలో పడిపోయింది. సభకు పోటెత్తిన అశేష జనవాహినిని చూసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులకు భవిష్యత్తు కండ్లముందు సాక్షాత్కరిస్తున్నది. రాష్ట్రంలో తమ పార్టీకి ఇక నూకలు చెల్లినట్లేననే అంతర్మథనం వారిలో మొదలైందనే చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్‌లో ఏ ఇద్దరు నేతలు కలిసినా.. రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగం పైనే చర్చిస్తున్నారు. హాజరైన ప్రజల సంఖ్య.. రేవంత్ ప్రభుత్వంపై వ్యతిరేకతకు అద్దం పడుతున్నదనే చర్చ జోరుగా జరుగుతున్నది. అధికార పార్టీ ఏడాదిన్నర కాలంలో ఇంతలా పతనం కావడం, ప్రతిపక్ష పార్టీ ఇంత తక్కువ సమయంలో ప్రజాదరణ చూరగొనడం అసాధారణ విషయంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ సభ, కేసీఆర్ ప్రసంగం బీఆర్‌ఎస్ క్యాడర్, లీడర్లలో నూతనోత్సాహం నింపితే.. కాంగ్రెస్ క్యాడర్, లీడర్లలో నైరాశ్యం నింపింది.

### మంత్రుల ప్రెస్‌మీట్.. కాంగ్రెస్‌లోనే విమర్శలు

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం కోసం యావత్ తెలంగాణ ప్రజలు ఎంత ఆత్రుతగా ఎదురు చూశారో... సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ మంత్రులు అంతకన్నా ఎక్కువగా ఎదురుచూసినట్లు ఉన్నారు. సభ మొదలు కావడానికి ముందే మంత్రులు పొంగులేటి, సీతక్క, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. కేసీఆర్ ప్రసంగాన్ని 50 నిమిషాల పాటు సీఎం సహా మంత్రులంతా కలిసి వీక్షించారు. ఆ తర్వాత మంత్రులంతా సీఎం ఇంటి బయటే మీడియా ముందుకొచ్చారు. నలుగురు మంత్రుల్లో ఏ ఒక్కరూ కేసీఆర్ సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా.. గులాబీ అధినేతపై ఎదురుదాడికే యత్నించారు. ఓవైపు కేసీఆర్ రాజనీతిజ్ఞతతో విమర్శలు గుప్పిస్తే.. మంత్రులు మాత్రం ఫ్రస్ట్రేషన్‌కు గురై కేసీఆర్‌పై వ్యక్తిగత దాడికి దిగారు. మంత్రుల వ్యాఖ్యలపై సొంత పార్టీలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్‌ఎస్ సభ పెట్టుకుంటే వదిలేయకుండా సీఎంతో పాటు మంత్రులంతా స్పందించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మంత్రులంతా ఇష్టమొచ్చినట్లు మాట్లాడి సభకు మరింత హైప్ తీసుకొచ్చారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### యువత, రైతులు.. బీఆర్‌ఎస్‌కు షిఫ్ట్

గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు మొన్నటి వరకు కాంగ్రెస్‌కు అండగా నిలిచిన యువత, రైతులు ఇప్పుడు ఆ పార్టీకి హ్యాండ్ ఇచ్చినట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ సభకు తరలివచ్చినవారిలో అత్యధిక శాతం యూత్, రైతులే ఉండడాన్ని వారు ఉదహరిస్తున్నారు. వారంతా తండోపతండాలుగా స్వచ్ఛందంగా తరలివచ్చారు. దీంతో రాష్ట్రంలోని యువత, రైతులు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ వైపు మళ్లారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతులు, యువతను బీఆర్‌ఎస్ వైపు వెళ్లకుండా చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందనే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల సమయంలో యువత, రైతులను ఆకట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ తర్వాత వారి మద్దతును కాపాడుకోవడంలో విఫలమయ్యారని అంటున్నారు. ఉద్యోగాలు ఇవ్వడంలో విఫలమైన కాంగ్రెస్.. రైతులకు రైతుభరోసా, ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంలోనూ విఫలమైందని చెబుతున్నారు. కాంగ్రెస్‌తో పోల్చితే బీఆర్‌ఎస్ ప్రభుత్వమే బెటర్ అనే అభిప్రాయం యువత, రైతుల్లో వ్యక్తమవుతుందని పేర్కొంటున్నారు.

### కాంగ్రెస్ సోషల్ మీడియా అట్టర్‌ఫ్లాప్...

ఎల్కతుర్తి సభలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్ల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకున్నది. అంత పెద్ద సభలో వారందరికీ 'నేనున్నా'నంటూ కేసీఆర్ భరోసా ఇచ్చారు. సాధారణంగా ఏ పార్టీ అగ్రనేత కూడా ఈ విధంగా సొంత పార్టీ సోషల్ మీడియా వారియర్స్‌కు భరోసా ఇచ్చిన సందర్భాలు లేవు. ఇది వారికి పెద్ద బూస్టింగ్ అనే చెప్పాలి. అదే సమయంలో కాంగ్రెస్ సోషల్ మీడియా అట్టర్‌ఫ్లాప్ అయిందనే అభిప్రాయాలు కాంగ్రెస్ వర్గాల్లోనే వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియా వారియర్ల ప్రాధాన్యతను కేసీఆర్ గుర్తించారని, కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వెనుక సోషల్ మీడియా వారియర్ల శ్రమ 50 శాతానికి పైగా ఉన్నది. అలాంటి సోషల్ మీడియాను, వారియర్లను అధికారంలోకి వచ్చాక రేవంత్‌రెడ్డి పక్కనపెట్టారని, నిర్లక్ష్యం చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఉండి కూడా వారికి భరోసా ఇవ్వలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలు

ఎల్కతుర్తి సభతో తాము అధికారంలోకి వచ్చేశామని కేసీఆర్ ప్రకటించేశారు. రెండున్నరేండ్ల సమయం మాత్రమే కాంగ్రెస్‌కు ఉందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారేనని బలంగా చెప్పారు. కేసీఆర్ ప్రకటనతో తమ పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైందంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు చర్చించుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే డౌన్‌ఫాల్ మొదలైందని చెబుతున్నారు. ఓవైపు బీఆర్‌ఎస్ పుంజుకోవడం, మరోవైపు కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మరింతగా పెరుగుతుండడంతో ఇప్పట్లో కాంగ్రెస్ సర్కారు లేచే పరిస్థితి లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నర కాలంలోనే అధికార పార్టీపై ప్రజల్లో ఇంత వ్యతిరేకత రావడం, అదే సమయంలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరగడం సాధారణ విషయం కాదని చెబుతున్నట్టు సమాచారం. తమ పార్టీ ఎంత వేగంగా క్షీణిస్తున్నదో ఈ పరిస్థితిని చూస్తే అర్థమవుతున్నదని సొంత పార్టీ నేతలే చెబుతుండడం గమనార్హం. ఇప్పటికైతే పార్టీ పరిస్థితి ఇంతేనని, ఏం చేయలేని పరిస్థితి నెలకొన్నదని పెదవి విరుస్తున్నారు.

### కాంగ్రెస్ ఉంటేనే బీఆర్‌ఎస్‌కు లాభం

కాంగ్రెస్ సర్కారును పడగొట్టబోమని, ఆ అవసరం తమకు లేదని, ప్రజలే కాంగ్రెస్ పార్టీ వీపు సాపు చేస్తరంటూ ఎల్కతుర్తి సభలో కేసీఆర్ ప్రకటించారు. అయితే ప్రభుత్వాన్ని పడగొట్టబోమనే మాటల వెనుక పెద్ద వ్యూహమే ఉందనే అభిప్రాయాలు బీఆర్‌ఎస్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఇప్పటికే పరిపాలనలో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ సర్కారు పెద్ద ఎత్తున ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నది. కేసీఆర్ చెప్పినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ ఫెయిలైంది. దీంతో ఇప్పుడిప్పుడే రైతులు, యువత, ప్రజల్లో కాంగ్రెస్‌పై ఉన్న సానుభూతి, సదాభిప్రాయాలు తొలగిపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే తమ బతుకులు బర్బాదేననే భయానికి ప్రజలు వచ్చారు. ఇందుకు తగ్గట్లుగానే కేసీఆర్ కూడా కాంగ్రెస్ ఉంటేనే తమకు లాభమని, అప్పుడే ప్రజలకు మంచేదో, చెడేదో తెలుస్తుందని చెప్పారు. ఎన్నికల సమయంలోనూ ఓ సందర్భంలో గాడిద ఉంటేనే కదా గుర్రం విలువ తెలిసేదంటూ వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటూ, ప్రజాభిమానాన్ని కోల్పోతున్న పార్టీ, ప్రభుత్వంపై మరో రకంగా ముందుకెళ్లాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజలే ఆ పార్టీకి బుద్ధి చెబుతారని, అందుకే కేసీఆర్ ఆ విధంగా వ్యాఖ్యలు చేసి ఉంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### కగార్‌పై కేసీఆర్ ఎత్తుగడ... బీఆర్‌ఎస్ వైపు వామపక్షాల చూపు

కగార్ పేరుతో మావోయిస్టులపై కేంద్ర సర్కారు చేస్తున్న మారణకాండను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ విధంగా కగార్ విషయంలో కేంద్రానికి వ్యతిరేకంగా గళం విప్పిన మొదటి రాజకీయ నేత కేసీఆర్ కావడం గమనార్హం. కేసీఆర్ మద్దతుతో, ఆయన ప్రసంగంతో వామపక్ష పార్టీలకు, ప్రజా సంఘాలకు బలం వచ్చినట్టయింది. అయితే ఓవైపు వామపక్ష పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ గాని, సీఎం రేవంత్‌రెడ్డి గాని ఈ వివాదంపై ఇప్పటి వరకు నోరు మెదపలేదు. సాధారణంగా వామపక్ష పార్టీలు, లెఫ్ట్ భావజాలమున్న ప్రజాసంఘాలు కాంగ్రెస్‌కు సానుభూతిపరులుగా ఉంటాయి. కానీ, ఈ దెబ్బతో కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న వాళ్లంతా ఆ పార్టీకి దూరమై బీఆర్‌ఎస్ వైపు చూసే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



సీఎం రేవంత్ సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి వేస్తున్న నాలుగు లేన్ల రోడ్డు

# ముఖ్యమంత్రి ఊరు.. రైతుల్ని ముంచారు

మొదటిపేజీ తరువాయి...

పనులతో రైతులు తమ పొలాలకు వేసుకున్న కంచెలు మునిగిపోతున్నాయి. హద్దులు చెరిగిపోతున్నాయి. నీటి పైప్‌లైన్లు, చెట్లు, గట్లు కోల్పోయిన బాధలో ఇదెక్కడి అన్యాయమని అడగాలంటే అధికారం కన్నెర్ర చేస్తుందని భయపడుతున్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తామని గప్పాలు కొట్టిన చిల్లర దేవుళ్లు ఇప్పుడు ఫోన్‌కూడా లిఫ్ట్ చేయడం లేదట. పనులకు అడ్డం పడేంత శక్తిలేకపోవడంతో రైతులు దీనంగా చూస్తున్నారు.

### 6 కిలోమీటర్ల మేర రోడ్డు

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లికి 2015 వరకు పీఆర్ రోడ్డు ఉండేది. 2016-17లో ఆర్ అండ్‌బీ రోడ్డుగా మారుస్తూ డిండిచింతపల్లి వరకు సింగిల్ లేన్ రోడ్డు నుంచి డబుల్ రోడ్డుగా మార్చారు. రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో కొండారెడ్డిపల్లి వరకు 6 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు వేయాలని నిర్ణయించారు. జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై కొండారెడ్డిపల్లి గేట్ నుంచి కొండారెడ్డిపల్లి గ్రామం వరకు రోడ్డు విస్తరించి నాలుగు లైన్ల రోడ్డు చేపట్టాలని హడావుడిగా నిర్ణయించి పనులు ప్రారంభించారు.

### ప్రాథమిక అంచనా రూ.17 కోట్లు

కొండారెడ్డిపల్లి గేట్ నుంచి కొండారెడ్డిపల్లి గ్రామం వరకు 6 కిలోమీటర్ల మేర నాలుగులేన్ల రోడ్డుకు రూ.17 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా. ఇందులో రాష్ట్ర వాటా 25 శాతమైతే కేంద్రం వాటా 75 శాతం. ఇందులో ప్రధానమైన ట్విస్ట్ ఏమంటే.. రోడ్డు వెడల్పునకు అవసరమయ్యే భూమి సేకరించి, సంబంధిత డాక్యుమెంట్లు కేంద్ర ప్రభుత్వానికి అందిస్తే రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే డబ్బును కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. రోడ్డు వెడల్పు పనులకు ఇప్పటివరకు భూసేకరణ చేయలేదని రైతులు అంటున్నారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వలేదని, పోయిన భూమికి డబ్బు ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు విస్తరణకు హద్దు రాళ్లు పాతినట్టు తెలిపారు.

### 66 అడుగుల రోడ్డు నిర్మాణం

6 కిలోమీటర్ల మేర 66 అడుగుల వెడల్పు (2105 మీటర్లు)తో నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు ఒక్కో చోట నాలుగు నుంచి ఆరేడు మీటర్ల ఎత్తు పైకిలేచింది. రోడ్డును పైకి లేపి మట్టిని పోయడంతో చాలామంది రైతుల తోటలు, ఫెన్సింగ్‌లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, హద్దులు మునిగిపోయాయి. నష్టపరిహారం కూడా ఇవ్వలేదని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కొండారెడ్డిపల్లి గేట్ వద్ద ఎకరం దాదాపు రూ.2కోట్ల వరకు పలుకుతున్నది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, భూసేకరణ చేయకుండా రోడ్డు నిర్మిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

### నా ఫెన్సింగ్ మునిగిపోయింది



కొండారెడ్డిపల్లి గేటు సమీపంలో నాకు ఏడెకరాలు ఉన్నది. నాలుగు లేన్ల రోడ్డులో దాదాపు 10గుంటల పొలం పోయింది. రోడ్డు కోసం హద్దు రాయి పాతి మార్క్ వేశారు. నా పొలం వద్ద రోడ్డు దాదాపు 8 మీటర్లపైకి లేచింది. రోడ్డు మీద పోసిన మట్టిలో నా పొలం ఫెన్సింగ్, ట్రాన్స్‌ఫార్మర్ మునిగిపోయింది. ఇదేమిటని అడిగితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు. - కే దశరథ్‌రెడ్డి, తాండ్రగ్రామం, నాగర్‌కర్నూల్ జిల్లా

### • నిలువ నీడ లేదు.. తాగేందుకు నీళ్లు లేవు



ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. తాగు నీరు లేక గొంతెండిపోతున్నదని, కనీసం నీడ లేక చెట్ల కింద కూర్చోవాల్సి వస్తుందని, వేడిగాలితో ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గాలివానొస్తే టార్పాలిన్లు ఇచ్చేవారు కరువయ్యారు. విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయడకపోవడంతో వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసి వేసిన టార్పాలిన్లు దొంగలు ఎత్తుకుపోతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. - నర్సింహులపేట

### • వడ్లు కొనాలని రైతుల ఆందోళన



ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు సోమవారం జాతీయ రహదారిని దిగ్బంధించారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి, గుత్ప గ్రామాల రైతులు 63వ జాతీయ రహదారిపై అడవి మామిడిపల్లి వద్ద రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో నిజామాబాద్-ఆర్మూర్ మధ్యలో రాకపోకలు నిలిచిపోయాయి. వందలాది వాహనాలు బారులు తీరాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వలేదని, ఇప్పుడు పంట నష్టం జరిగితే ఆత్మహత్యలు తప్పవని ఆవేదన వ్యక్తంచేశారు. మాక్లూర్ పోలీసులు సర్ది చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. - మాక్లూర్

### • తరుగు లేకుండా ధాన్యం కొనాలి



తరుగు తీయకుండా ధాన్యం కొనాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వైరా వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు రైతు సంఘాలు, బీఆర్‌ఎస్, వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ముజామిల్ ఖాన్, ఎస్సై భాగ్యరాజ్ అక్కడికి చేరుకొని రైతులతో చర్చలు జరిపారు. జిల్లా అధికారులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, తరుగు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. - వైరాటౌన్

# ధాన్యం కొంటలేరు

## మంచిర్యాల జిల్లాలో రైతుల ఎదురుచూపులు

- తేమశాతం వచ్చి 15 రోజులైనా తూకానికి నోచుకోని దైన్యం
- కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు
- పనిచేయని కొత్త ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు
- 40 కిలోల బస్తాకు రెండు కిలోలు దోపిడీ



కొనుగోళ్లు ఆలస్యం కావడంతో గుళ్లకోట కొనుగోలు కేంద్రంలో కుప్పలుగా పోసి, పరదాలు కప్పి ఉంచిన ధాన్యం

మంచిర్యాల, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలో ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చి పదిహేను రోజులు దాటినా తూకం వేయకపోవడంతో అక్కడే పడిగాపులు కాస్తున్నారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో వర్షాలు పడే అవకాశముండగా, ధాన్యం తడిసి నష్టపోతామేమోనని ఆందోళన చెందుతున్నారు. నిబంధనలను అనుసరించి ధాన్యం కొనాలంటే తేమశాతం 17 ఉండాలి. కానీ తేమ 12 శాతం నుంచి 14 శాతానికి వచ్చినా కొనడం లేదంటూ మంచిర్యాల జిల్లా రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఏ కొనుగోలు కేంద్రానికి వెళ్లి చూసినా కుప్పలుగా పోసిన ధాన్యపు రాశులు.. వాటికి కాపాలా కాస్తున్న రైతులే కనిపిస్తున్నరు. వారం క్రితం ధాన్యం కొనుగోళ్లు మొదలైనప్పుడు ధాన్యం తప్పనిసరిగా తూర్పారాబట్టాలని అధికారులు చెప్పారు. తూర్పారా పట్టలేదన్న కారణంతో లారీ లోడ్‌కు 15 బస్తాల నుంచి 20 బస్తాల ధాన్యానికి రైస్ మిల్లర్లు కోతలు పెట్టారు. దీంతో రైతులు ప్యాడీ క్లీనర్ యంత్రాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. తూర్పారా పట్టకపోతే బస్తాకు రెండు కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

### యంత్రాలు మొరాయిస్తున్నాయని..

మంచిర్యాల జిల్లాలో 321 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా, ముందు 95, ఇటీవల మరో 49 ప్యాడీ క్లీనర్ యంత్రాలను సమకూర్చారు. కేంద్రాలకంటే యంత్రాలు తక్కువగా ఉండటంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.కొత్త యంత్రాలైనప్పటికీ అవి చాలావరకు పని చేయడం లేదు. మోటర్ కాలిపోయిందని చాలా కేంద్రాల్లో యంత్రాలను పక్కన పెట్టేశారు. మూడెకరాల్లో పండిన ధాన్యాన్ని క్లీన్ చేసేందుకు యంత్రం నాలుగు నుంచి ఐదు గంటల సమయం తీసుకుంటుంది. దీంతో రైతులు ప్యాడీ క్లీనింగ్ కోసం నిరీక్షించాల్సి వస్తుంది. రోజుల తరబడి తూర్పారా పట్టడం కోసం సీరియల్ వారీగా ఎదురు చూస్తున్నామని... ఈ లోగా యంత్రాలు పని చేయకపోవడంతో చివరకు క్లీనింగ్ అవసరం లేదని 40 కిలోలు తూకం వేయాల్సిన బస్తాను 42 కిలోలు తూకం వేస్తున్నారని రైతులు చెప్తున్నారు.

### రెండు రకాలుగా నష్టం..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తున్న రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు. ఎక్కువ తూకం వేస్తూ క్వింటాకు 10 కిలోలు తీసుకోవడం ఒకటైతే.. తేమశాతం తగ్గడం కూడా రైతులకు నష్టం తీసుకువస్తుంది. ధాన్యం కోసి కేంద్రానికి తెచ్చి ఆరబోసిన మూడు నుంచి నాలుగు రోజుల్లో 17శాతం తేమ వస్తుంది. కానీ పదిహేను, ఇరవైరోజులుగా కొనుగోలు చేయకపోవడంతో తేమశాతం 11శాతం నుంచి 12 శాతానికి పడిపోయింది. కొన్ని చోట్ల తేమ శాతం 10 వస్తున్నది. దీంతో ధాన్యం బరువు తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. అన్ని రకాలుగా మిల్లర్లకు లాభం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నాంటూ అసహనం వ్యక్తంచేస్తున్నారు. తప్ప, తాలు పేరుతో కిలో ఎక్కువ తీసుకోడానికి తమకు అభ్యంతరం లేదని.. కానీ బస్తాపై రెండు కిలోలు తీసుకోవడం సరికాదని అంటున్నారు.

### కుప్పపోసి పెట్టి 10 రోజులు దాటింది



కేంద్రానికి ధాన్యం తెచ్చి 15 రోజులైతంది. ఐదు రోజులకే తేమశాతం 17 వచ్చింది. కుప్ప పోసి పెట్టి 10 రోజులు దాటింది. వర్షం వస్తే ధాన్యం మొత్తం తడిసిపోతది. మొన్నటి దాకా తూర్పార పట్టమని చెప్పారు. అదే లేకపోతే ఈ పాటికి తూకం అయిపోయేది. పది రోజులుగా రోజూ పడిగాపులు కాయాల్సి వస్తుంది. వర్షాలు రాక ముందే ధాన్యం కొనాలి.

- మోటపలుకుల చంద్రయ్య, గుళ్లకోట రైతు



నాగేశ్వర్‌రావు, సురేశ్(ఫైల్)


### మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- సూర్యాపేట, మెదక్‌లో విషాదం

పెన్‌పహాడ్/చిన్నశంకరంపేట, ఏప్రిల్ 28 : సాగు కలిసి రాక మరో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కాళేశ్వరం నీళ్లు రాక పంట ఎండటంతో సూర్యాపేట జిల్లాలో ఒకరు, దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక మెదక్ జిల్లాలో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మేగ్యతండాకు చెందిన అంగోతు నాగేశ్వర్‌రావు (38) రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాడు. నీళ్లు లేక పంట ఎండిపోయింది. ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లికి చెందిన లింగాపురం సురేశ్ (30) అప్పు తీర్చే మార్గం కానరాక సోమవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

### వడదెబ్బతో రైతు మృతి

- ధాన్యం ఆరబెట్టి మృత్యువాత



ఎన్నమాల సారయ్య (ఫైల్)

తొర్రూరు, ఏప్రిల్ 28 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామానికి చెందిన రైతు వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గోపాలగిరికి చెందిన ఎన్నమాల సారయ్య(45) ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ఆరబోశాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ధాన్యం ఆరబెట్టి ఇంటికి వచ్చిన సారయ్య ఒక్కసారిగా సొమ్మసిల్లిపడిపోయాడు. తల్లిదండ్రులు వెంటనే తొర్రూరులోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. సారయ్యకు భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### • తరుగు పేరిట దోపిడీపై రైతుల నిరసన



నిర్మల్ జిల్లా ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ధాన్యం తరుగు పేరిట మిల్లర్లు, నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. - ఖానాపూర్

### • గన్నీ బ్యాగులు ఇయ్యరా?



పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలంటే గన్నీ బ్యాగుల కొరత వేధిస్తున్నదని రైతులు వాపోయారు. సోమవారం నారాయణపేట జిల్లా మాగనూరులో జరిగిన భూభారతి అవగాహన సదస్సులో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను మండలంలోని పలు గ్రామాలకు చెందిన 50 మంది రైతులు గన్నీ బ్యాగుల సమస్యను విన్నవించారు. - మాగనూర్